


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



### వినదగు నెవ్వరు చెప్పిన

**రోజులు మారిపోయాయి గూగులమ్మ** దేవత పుణ్యమా అని ఎవరేం చేస్తున్నా, ఒక్క సెకనులో విశ్వవ్యాప్తంగా ప్రచారం అవుతోంది.

నిన్న ఓ కుర్రాడు అందరూ ఎఫ్.బీ.లో స్నేహితుల గురించి వీడియోలు తయారు చేసే ఆప్షన్ ఉపయోగించుకుంటుంటే, 'I am self centred…Hence I want to make my own video.' అని స్టాటస్ పెట్టాడు.

అది చూసి నేను ముచ్చట పడి 'లైక్' కూడా కొట్టాను. పైన అప్పారావుగారి తల్లి ఆబ్దికం అని పెడితే పనిలో పని దానికి కూడా 'లైక్' కొట్టాను.

ఈ 'సెల్ఫ్ సెంటర్డ్' అన్న కుర్రాడి పెళ్ళాం నాకు ఫోన్ చేసి "చూసారా వాడి ఈగో.. అలాంటి వాడితో ఎలా కాపురం చెయ్యాలి చెప్పండి?" అంది.

"ఒరేయ్ నాయినా అరిటాకు వచ్చి ముల్లు మీద పడ్డా, ముల్లు వచ్చి అరిటాకు మీద పడ్డా, ఈ రోజుల్లో పాడయ్యేది మగాడి జీవితమేరా!' అలాంటి స్టేట్‌మెంట్ ఎందుకు పెట్టావు? అంటే చాలా 'లైక్‌లు' వస్తాయని పెట్టాను అన్నాడు.

ఇంకొక అత్తగారు కొత్తగా డిజైనర్ శారీ కొనుక్కుని, దానిమీద మాచింగ్ జ్యువెలరీ కూడా పెట్టుకుని ఫేస్ బుక్‌లో పెడితే, కోడలు 'LOL' అని కామెంట్ పెట్టిందట.

ఆవిడ వేయిస్తున్న పూరీలు సగంలో ఆపేసి, 'LOL' అంటే ఏమిటని కొడుకుని అడిగితే 'లాఫింగ్ ఔట్ లౌడ్లీ' అని చెప్పాడుట. అంతే ఆవిడ పొయ్యి ఆర్పేసి, ఎర్రనైన ముక్కుతో, "నేను కొత్త చీరలో అంత నవ్వొచ్చేట్లు ఉన్నానా? నీ పెళ్ళాం అదేదో ముప్పాతిక లాగూ (త్రీ ఫోర్త్సు) వేసుకుని ఫోటో పెడితే, నేను నవ్వానా? మొన్న మంగళవారం నాడు చిలుకూరి వారి కోడలొచ్చి పసుపు ఇస్తే ఎక్కడ పెట్టుకోవాలో నీ పెళ్ళానికి తెలీలేదు. ఎందుకంటే మెడలో వేసుకోవాల్సిన మంగళ సూత్రం, గోడకి వేళాడ్తోంది కనుక. అప్పుడు 'LOL' అని నేను నవ్వానా? ఎదురింటి కమల గారి పిన్ని అమలాపురంనుండొచ్చి, మన పెరటిలో ఉన్న మీ ఆవిడ్ని చూసి 'ఇదిగో అబ్బాయ్! రెండు నందివర్ధనం పూలు కోసి ఇస్తావూ?' అన్నప్పుడు నేను 'LOL' నవ్వానా? "

"అమ్మా ఇవాళ నేనూ, మీ మావగారూ ఉపవాసం చపాతీలు రెండు చేసి మీ ఆయనకి పెట్టు," అంటే ఆవిడగారు ఆస్ట్రేలియా మేప్‌లు వేసినప్పుడు నేను నవ్వానా? పువ్వులు మాల కట్టడం రాదన్నప్పుడు నేను నవ్వేనా? మినపప్పుని 'వైట్' పప్పు అనీ 'పెసరపప్పు'ని ఎల్లో పప్పు అనీ, ఆవకాయని 'రెడ్ పికిల్' అనీ అన్నప్పుడు నేను 'LOL' అని నవ్వానా? చీర కట్టుకోవడం రాక, వాళ్ళమ్మ కుచ్చిళ్ళు

కుట్టించిన శారీస్ ఇస్తే అది తొడుక్కుంటున్నప్పుడు నేను నవ్వానా? ఇన్నింటికి నేను నవ్వనప్పుడు నా డిజైనర్ శారీ చూసి పబ్లిక్‌గా మీ ఆవిడ నవ్వుతుందా ఎఫ్.బి.లో?" అని ఆవేదన చెందింది చెంచులక్ష్మి.

దానికి ఆవిడ కొడుకు 'అమ్మా మా ఆవిడ 'LOL' అంటేనే ఇంత ఫీల్ అవుతున్నావు వాళ్ళమ్మ 'ఐ యాం ఇన్ స్పా" అని ఎఫ్.బి.లో స్టాటస్ పెడితే, వీళ్ళ వదిన 'ROFL'అని పెట్టింది" అన్నాడు.

"అంటే?" అంది చెంచులక్ష్మి,

"అంటే రోలింగ్ ఆన్ ది ఫ్లోర్ విత్ లాఫ్టర్(Rolling on the floor with laughter) అని అర్థం" అన్నాడు.

దానితో చెంచులక్ష్మి బాగా అయిందని స్థిమితపడింది. పోన్లే పాపం నేలమీద దొర్లినవ్వడం లేదులే నా కోడలు అని!

సాధారణంగా నాకు పనిలేనప్పుడు నేను ఇంకో నలుగురి చేత పనిమానిపించి ఏ సినిమాకో, డాన్స్ ప్రోగ్రామ్‌కో తీసుకెళ్తుంటాను. అలాగే ఒక సినిమా అత్యవసరంగా చూడాల్సొచ్చింది. పరిస్థితులు అలాంటివి మరి. సదరు నిర్మాత మాకు ఆప్తులు. అందుకే టికెట్లు పంపించారు. నా వైద్య మిత్రులు నలుగురికి ఫోన్ చేసి **"ఈరోజు సాయంత్రంలోగా ఆపరేషను అవసరమేమో లేకపోతే కష్టమేమో అన్న పేషెంట్స్ ఎవరైనా ఎమర్జెన్సీలో ఉన్నారా?" అని అడిగా.**

మా న్యూరో సర్జన్ ఫ్రెండ్ "అలా ఇప్పుడు అడిగితే చెప్పలేను. భాగ్యనగరం రోడ్ల మీద ఆర్.టీ.సీ బస్సులు ఎప్పుడూ పేవ్‌మెంట్లు ఎక్కుతాయో, ఆటోవాళ్ళు హుషారొచ్చి ఎవరిని గుద్దుతారో, పిల్లలకి డ్రైవింగ్ లైసెన్స్ కన్నా ముందు 'ఆడీ' కార్లు ఇచ్చి ఏ తల్లితండ్రులు పంపుతారో నాకేం తెలుస్తుంది? ఇదేమైనా ఆలిండియా రేడియో వాతావరణ సూచనలా ముందే తెలుస్తుందా?" అన్నాడు.

ఇంకొక అమ్మాయి "ఈరోజుకి రోగాలకి శలవిమ్మని దేవుడ్ని ప్రార్థిద్దాం" అంది. మా ఫ్రెండ్ ఒకడు "ఆదివారం ఎలా పుట్టావు శలవు కదా?" అని తెగ ఆశ్చర్యపోయాడొకసారి. ఇంకొక కాన్సర్ స్పెషలిస్ట్ "కాన్సర్‌కి ఎమర్జెన్సీ ఉండదు.. వస్తే గ్యారంటీగా ఏడాది తీసుకుంటారు పాపం" అన్నాడు.

మొత్తానికి అందరినీ తీసుకుని నేను ఓ బ్రహ్మాండమైన సినిమాకి వెళ్ళాను. త్వరగా వెళ్ళిన పాపానికి, లేట్‌గా వచ్చిన వాళ్ళకి సినిమా మొదలయిన పదినిమిషాల కథ చెప్పి, వెనక వాళ్ళతో చివాట్లు తిని మొత్తానికి సినిమా చూసాం. ఇంటర్వెల్‌లో మా డాక్టరొకడు **"చివరి బెడ్ మాణిక్యాలరావు ఇంకా ఉన్నారా? ఉంటే నేను చెప్పిన ఇంజెక్షన్ చేసెయ్యి"** అనడం ఫోన్లో నాకు వినిపించింది. ఇలా వాళ్ళ ఎమర్జెన్సీ ఫోన్లూ, మధ్య మధ్యలో నన్ను కథ అడగడటాలుతో సినిమా అయిందనిపించాం. నేను '3జి' ఆన్ చేసి బ్రహ్మాడమైన ఉత్సాహంతో అందరి పేర్లూ 'టాగ్' చేస్తూ 'ఇన్ బిగ్ సినిమాస్' అని పెట్టాను.

అందులో ఒక డాక్టర్ మిత్రుడు పెళ్ళాం సినిమాకి వెళ్దాం అంటే వారం నుండీ 'బిజీ' అని చెప్తున్నాడట. చివరికి పెళ్ళిరోజున కూడా సినిమాకి తీసుకెళ్ళలేదుట. ఆవిడ కూడా నా ఎఫ్.బీలో ఉండడం అతని దురదృష్టం. ఇంక ఇంటికి వెళ్ళేసరికి అతని పరిస్థితి ఏవిటో నేను వేరే చెప్పక్కర్లేదు అనుకుంట. అనుభవజ్ఞులు మీరే ఆలోచించగలరు. సో... ఈ టాగింగ్‌లతో ఇదో చిక్కు.

ఇంటికి రాగానే పెళ్ళాం "తందూరీ చికెన్‌లు తినొచ్చిన వాళ్ళకి, నా గోరు చిక్కుడు కాయ కూర ఏం నచ్చుతుంది లెండి?" అని సాధిస్తే సదరు రాంబాబుకి ఫ్లాష్ వెలుగుతుంది ఇందాకా 'బార్ బెక్యునేషన్స్'లో ఫ్రెండ్ ఎవడో టాగ్ చేసుంటాడనీ, అది భార్యామణి వీక్షించిందనీ.

సూరిబాబు ఆప్షన్ ఉంది కదా అని ఎఫ్.బీ.లో 'ఫీలింగ్ ఎగ్జైటెడ్' అని పెడితే ఇంటికి రాగానే పెళ్ళాం అడుగుతుంది "ఏమైంది? అంత ఎగ్జైట్ మెంట్? ఆఫీస్‌లో కొత్త అమ్మాయి చేరిందా? నా సిస్టం పాడయింది కొంచెం చూస్తారా? అని నీ దగ్గరగా వచ్చి 'ఇంటిమేట్'గా అడిగిందా? పాత గర్ల్‌ఫ్రెండ్ ఎవరైనా 'కలుద్దామా?' అని ఫోన్ చేసిందా?"

"అయ్యో అపార్థసారథమ్మా.. అవేం కాదే. కాండీ క్రష్ ఆడాను.. స్కోర్ బాగా రావడంతో ఎగ్జైట్ అయ్యాను"

అంటే ఆవిడ నమ్ముతుందా? కాండీ క్రష్ అంటే గుర్తొచ్చింది. మా తమ్ముడొకడికి నాలుగు నెలలుగా ఓ పని చెయ్యమని చెప్తున్నా, చెయ్యడం లేదు. పోనీలే బిజీగా ఉన్నాడు అనుకున్నా, కానీ ప్రొద్దుటే ఎఫ్.బి ఓపెన్ చేస్తే వాడినుండి 'కాండీ క్రష్' లేదా 'ఫార్మ్ విల్లా సాగా' ఆడుకుందాం రమ్మని ఇన్విటేషన్స్.. దీన్నిబట్టి వాడు ఎంత ఖాళీగా ఉన్నాడో తెలిసి నేను ఫోన్ చేసి "నేను చెయ్యమన్న పని చేసావా?" అనగానే" ఆఫీస్‌లో ఒక్క నిమిషం తీరికుండడం లేదక్కా... బిజీగా ఉంటున్నా" అన్నాడు.

'దొరికావురా' అనుకుని "ఏరా.. ఆఫీస్‌లో రోజంతా కాండీ క్రష్ ఆడడంలో తీరికుండడం లేదు కదూ!" అన్నా, వాడికి తెలీదుట, వాడు ఆడినప్పుడల్లా ఇలా వాడి ఫ్రెండ్స్ లిస్ట్‌లో ఉన్న వాళ్ళందరికీ ఆహ్వానాలొచ్చి ఆడిపోసుకుంటారనీ...

నాకు కొంతమంది ఆపదబంధువులున్నారు. అంటే వాళ్ళొస్తే ఆపదలొస్తాయనమాట. అలాంటి వాళ్ళకి నేను ఫోన్ చేసినప్పుడు 'బిజీగా ఉన్నాను. ఇప్పుడు కలవటం కుదరదు' అని చెప్పలేక "ఊళ్ళో లేనండీ" అంటుంటాను. కానీ సాయంత్రం 'ఎట్ శిల్ప కళావేదికా విత్ సుమిత్రా' అని స్టాటస్ పెడితే, వాళ్ళకి నిజం తెలిసిపోయి, ఈసారి ఫోన్ చెయ్యకుండానే ప్రొద్దుటే మా ఇంటి కాలింగ్ బెల్ కొట్టి కుటుంబ సమేతంగా వాకిట్లో కనిపిస్తారు. **మనం ఫోన్స్‌లో ఈరోజు ఏం చెప్పామో ఓసారి గుర్తు చేసుకుని స్టాటస్ పెడ్తుండాలి.**

ఇంకా విచిత్రమైన విషయం. మా ఫ్రెండ్ కోడలిద్వారా తెలిసింది. 'ఆంటీ.. మా హజ్బెండ్‌కి నేనంటే కేర్ లేదు. అస్సలు నా గురించి పట్టించుకోడు. పెళ్ళికి ముందు నా హాస్టల్ ముందు గంటల తరబడి వెయిట్ చేసేవాడు. ఇప్పుడూ చూడండీ అస్సలు కేరేపిన్ అన్నట్లు ఉంటున్నాడూ!" అంది.

"అయ్యో.. ఏం చేసాడమ్మా? ఏమైందీ?" అని అడిగాను.

"వాట్సప్‌లో వారం నుండీ 'లవ్ విత్ బేంగ్లూర్ డేస్" అని స్టాటస్ పెట్టాను. ప్రతి రోజూ ఆన్‌లైన్ కనిపిస్తూనే ఉన్నాడు. కానీ "లవ్ విత్ బేంగ్లూర్ డేస్ అంటే ఏవిటి? అసలు నా పెళ్ళానికి దేనితో లవ్ ఎవరిమీద లవ్? అన్న క్యూరియాసిటీ ఉండాలి కదా? నన్ను పట్టించుకోవడం లేదు.. నేను బేంగ్లూర్ లో ఉన్నాను తను ఢిల్లీలో. అందుకే ఇంక ఆలోచించడం కూడా అనవసరం అనుకుని ఉంటాడు" అని ముక్కు చీదింది.

నేను నోరు తెరిచేసా 'బేంగ్లూర్ డేస్' సినిమా చూసి ఈ అమ్మాయి వాట్సప్‌లో పెట్టిన స్టాటస్‌కి ఆ మొగుడు స్పందించడం లేదుట.

ఎదురుగా కళ్ళ ఎదుట నేను అటూ ఇటూ తిరుగుతున్న దాన్ని కాస్తా ఒక వారం అవుట్ డోర్ షూటింగ్ అని వెళ్ళినా.. మా ఆయన స్పందించడు. డైరెక్ట్‌గా నేను పెట్టే మెసేజెస్‌కే పెద్దగా ప్రతిస్పందన ఉండదు. "దీప్తూ మేరేజ్‌కి మేం అంతా ఒకే రకం పట్టుచీరలు కొనుక్కోవాలనుకుంటున్నాం" అని ఆయన పక్కన కూర్చుని చెవిలో చెప్పినా పెడ చెవిన పెడ్తారు. అసలు వాట్సప్‌లో నేనేం స్టాటస్ పెడుతున్నానూ? ఫేస్‌బుక్‌లో నేనేం వంటలు పెడ్తున్నానూ? అని పట్టించుకోవడం కూడానా? ఈ అమ్మాయి చెప్పినదానికి నేను విస్తుపోయాను.

కానీ ఆ అమ్మాయిని ఊరడిస్తూ "ఇలా వాట్సప్ స్టాటస్‌లు చూడాలనీ, పట్టించుకోవాలనీ నాకు తెలీదమ్మా" అని వెంటనే నా ఫ్రెండ్స్ అందరి స్టాటస్‌లూ నా సెల్‌ఫోన్‌లో చెక్ చేసాను. పాపం "బిజీ'.. "కాల్ వెన్ అర్జెంట్ ఓన్లీ".. "ఓన్లీ ఇన్ క్రిటికల్ సిట్యుయేషన్ కాంటాక్ట్‌మీ" "ఓన్లీ ఇన్ యువర్ లాస్ట్ మినిట్స్" లాంటి స్టాటస్‌లు పెట్టుకున్నారు. అందరూ బిజీగా ఉండే హై సర్కిల్ పెద్దమనుషులు. ఈ రోజు ఈ అమ్మాయి వల్ల నేను కళ్ళు తెరిచి వాళ్ళ మనోభావాలు తెలుసుకున్నాను. పట్టించుకోను అనుకోండీ. మనసులో ఏదైనా సందేహం వస్తే ఠక్కుమని ఫోన్ చేస్తా "వంశీ పచ్చిమిరపకాయలు కాన్సర్‌ని నివారిస్తాయిట నిజమేనా" దగ్గరనుండి "రసికరాజ తగువారము కామా పాట ఎందులోది వంశీ?" వరకూ నా డాక్టర్ ఫ్రెండ్స్‌ని టక్కున ఫోన్ చేసి అడిగేస్తా.. 'కాంటాక్ట్ మీ ఇన్ క్రిటికల్ కండీషన్స్ ఓన్లీ' అన్న వాట్సప్ మెసేజ్ చూసినా కూడా 'నాది క్రిటికల్ క్వశ్చనేగా' అనిపిస్తుంది.

మొన్న మా డాక్టర్ నాయక్‌గారికి ఫోన్ చేసి 'రేడియోలో కార్మికుల కార్యక్రమంలో చిన్నక్క పేరు రతన్‌ప్రసాదేనా? ' అని అడిగా.. ఆయన అవునని అని.. ఎమర్జెన్సీ కేస్ చూసి మళ్ళీ ఫోన్ చేసి, రేడియోలో మట్టపల్లి రావుగార్ని ఇందిరా బెనర్జీనీ తలుచుకుంటూ చాలా సేపు మాట్లాడారు.

నా ఫ్రెండ్స్ అంతా లైక్ మైండెడ్ వాళ్ళు. నా ఫ్రెండ్ బర్త్‌డే ఇవాళ అంటే 'పార్టీ ఎప్పుడూ?' అని అడిగే వాళ్ళూ శుభాకాంక్షలు చెప్పేవాళ్ళే కానీ 'నీ ఫ్రెండ్ ఎవరో మాకేం తెలుసూ?' అనే వాళ్ళు ఒక్కరూ లేరు. నీ ఫ్రెండ్ అయితే నాకూ ఫ్రెండే అనుకునే వాళ్ళే నా సర్కిల్‌లో ఉంటారు.

అసలు ఈ ఫేస్‌బుక్ అనేదే ఒక పెద్ద ప్రపంచం కదా! ప్రొద్దుటే తెరుస్తామా.. కావలి నుండి బెహరాగారనే ఆయన వేడి వేడి పొగలు కక్కే ఇడ్లీలూ, వెన్నపూసా, అల్లం పచ్చడీ, కొబ్బరి పచ్చడీ అరిటాకులో పెట్టి "మిత్రాస్.. తినండి.. తినండి.. మళ్ళీ వేడి చల్లారిపోతే బావుండవు" అంటాడు. మనసులో ఎంత ప్రేమ లేకపోతే అలా అంటాడు చెప్పండీ?

ఆ మధ్య శ్రావణ శుక్రవారం నాడు వరుసగా పట్టుచీరలు దొంతి పెట్టి "అక్కయ్యలూ.. చెల్లెళ్ళూ మీకు నచ్చిన రంగు తీసుకోండి" అన్నాడు.

మనం కోనంగిలం కదా! "ఆ ఆకుపచ్చ రంగుదీ, పసుపు పచ్చ రంగుదీ నావి" అన్నాను. ఇదంతా చూసిన మా అక్క ఇది నిజం అనుకుని, "ఎంత అదృష్టవంతురాలివే నీకు ఫేస్‌బుక్ ఫ్రెండ్స్ కూడా ఏకంగా పట్టు చీరలు పంపిస్తారూ!" అంది. అప్పుడు మనం 'LOL' కాదు 'ROFL' అన్నమాట.

ఓసారి మా అమ్మ ఎవరో పోతే సమాధి దగ్గర అంతా పూలు పెట్టడం చూస్తోంది. ఈలోగా నేను రిమోట్‌తో ఛానెల్ మారిస్తే మంతెన సత్యనారాయణ 'సుఖవిరేచనానికి చిట్కాలు' చెప్తున్నారు. అమ్మ 'ఈయన అక్కడ కూడా ఇవే మాట్లాడ్తాడా? అసలే పాపం పెద్దాయన పోయాడు కూడానూ!' అని తెగ బాధపడింది. అప్పుడూ మనం 'LOL'! ఇలా పెద్దాళ్ళని చూసి నవ్వి నవ్వి వాళ్ళ శాపాలన్నీ కొట్టీ, మన పిల్లకాయలు మనకి పేర్లు పెడ్తున్నారు.

కావలాయన ఇడ్లీలు పెట్టారు సరే.. ఇంకొకావిడ బాధా కవితలు రాస్తుంది. భావ కవిత్వం కాదు.. బాధా కవిత్వం.. "నీ అడుగుల సడికై ఎదురుచూస్తూ.. నేల మీద పడి ఉన్నా.. నా ఎడద మీదుగా నువ్వు కాలితో తొక్కి పోయావు" అంటుది. మొదటిసారి కాదు. రోజూ చెపుతుంది అతను తొక్కి పోతాడని. మరి నేల మీద పడుకోవడం ఎందుకు?

"నా కన్నీటి కాలవలలో.. కలల పడవలు మునిగిపోతున్నాయి.. తీరం చేరవు.. భారం తీరదు" అంటుంది. ఇలా ఈవిడ కన్నీటి కవిత్వం రాస్తుంటే, "ఎప్పటికైనా ఈ ఫేస్‌బుక్ మూసి అన్నం పెడ్తుందేమో.. వంటగదిలోకెళ్ళి అన్నం పడేస్తుందేమో పొయ్యి మీద అని మొగుడూ, పిల్లలూ ఆశగా ఎదురు చూస్తుంటారు నోళ్ళు తెరుచుకుని".

కానీ ఈ కవితలకి వెంటనే మూడొందల లైకులొస్తాయి.. అనకాపల్లి నుండీ కాశీపాకల అప్పలరాజు **'అక్కయ్యగారూ.. కవితలో కాస్త భారం ఎక్కువైనట్లుంది. ఫేస్‌బుక్ ఓ పక్కకి కుంగింది.. కాస్త తగ్గించరాదూ?'** అంటాడు.

"తమ్ముడూ నీ ప్రేమాప్యాయతలకి సంతోషం. కానీ హృదయంలో బడబాగ్ని అంత బరువుగా ఉంది. తప్పదు. భరించాలి" అంటుంది అక్కయ్య.

"అక్కా.. నీ కవితలు అద్భుతం. కంట నీరొచ్చింది. నలుగురిలో ఉన్నానని ఆపేసాను" అంటుంది ఓ చెల్లి.

"తల్లీ ఆపకమ్మా.. ఆపకు.. ఆ కంట నీరు దొరలనీ.. నీ ఆప్యాయత అనే వరదలో నన్ను కొట్టుకుపోనీ" అంటుంది అక్క. ఈలోగా పక్కన బావ శోషొచ్చి 'ధబ్బు'మన్న శబ్దంతో నేలమీద పడ్తాడు.'

మళ్ళీ అక్క ఫేస్‌బుక్‌లో 'నా సర్వస్వం అయిన నా ప్రాణనాధుడికి స్వస్థత చేకూరాలని మీరంతా షిరిడీ సాయినాధుడ్ని వేడుకోండి.. ఆయన లేస్తే కనుక వెంటనే షిరిడీ వెళ్తాను" అని ఫోస్ట్ చేస్తుంది.

ఈవిడ వెంటనే అన్నం వండి పెడితే చాలు ఆ నాధుడి ప్రాణం నిలబడుతుంది.

కానీ ఈ పోస్టింగ్‌కి వస్తున్న లైకుల్నీ, కామెంట్స్‌నీ రిసీవ్ చేసుకుని, '**నమస్కారానికి ప్రతి నమస్కారం సంస్కారం**' కనుక ఆవిడ మళ్ళీ వీళ్ళందరికీ 'థాంక్స్‌లూ, లైకులూ' గట్రా కొట్టేసరికి ఇంటి ముందు చితుకుల మంట పెట్టే పరిస్థితి రావచ్చు. అందుకే ఫేస్‌బుక్ మేనియా ఉన్నవాళ్ళు ఇంట్లో ఓ ఫుల్ టై సర్వెంట్‌ని కానీ భర్త తరపు దగ్గర బంధువుని కానీ ఉంచుకోవాలి.

ఈ కవిత్వాన్ని మనం జీర్ణం చేసుకుని క్రిందకి రాగానే 'రకరకాల పువ్వులూ, ఆకులూ, పక్షులూ, పిల్లులూ, కుక్కలూ' సర్వ జంతుజాలమూ మన కళ్ళకి ఇంపు చేస్తాయి. పిల్లలున్న వాళ్ళు తమ పిల్లల విన్యాసాలు పెడితే, పెంపుడు జంతువులున్న వాళ్ళు వారి పెంపుడు పిల్లలవి పెడ్తారు.

మా మల్లాదిగారి అమ్మాయి ఊహ వాళ్ళమ్మతో "దాన్ని పిల్లి అనకు.. దానికో పేరుంది.. నిన్నూ మనిషి అని పిలిస్తే నీకు ఎలా ఉంటుందో ఆలోచించు" అంటుందిట. అది విని మేము తెగ నవ్వాము

కానీ, మొన్నా మధ్య ఒకరింటికెళ్ళి కుక్కని 'అదీ' 'ఇదీ' అంటేనూ ఆవిడ తెగ బాధ పడ్తూ "టామ్ క్రూయిస్ అని మంచి పేరు పెట్టాం వాడికి.. అంత డామేజింగ్‌గా 'అది' అంటావేంటి రమణీ?" అంది. నేను నాలిక కరుచుకున్నాను.

ఇంకా విచిత్రమైన విషయం ఏవిటంటే, పెట్స్‌ని పెంచే వాళ్ళు వాటిని పిల్లల్లా చూసుకోవడం బాగానే ఉంటుంది కానీ, ఇంటికి వెళ్ళిన మనని 'ఆంటీ వచ్చింది స్నోయీ.. అరవకు' అనో, 'అక్కా బావా మనవాళ్ళేరా..' అనో కుక్కకి చెప్తుంటే మనకి ఏం అనాలో తెలీదు.

ఇంకాస్త ముందుకి వెళ్ళి కొంతమంది 'అది ఏకాదశి నాడు పచ్చిమంచినీళ్ళు ముట్టదు. ఉపవాసం చేస్తుంది అనో.. మనం కోపంగా ఉంటే దాని మనసు బాధ పడుతుంది భోజనం చెయ్యదనో చెప్తారు.'

మా ప్రొడ్యూసర్ వైఫ్ 'నాతో పోట్లాడితే ఆయన మా టైగర్ ఆయనని కరుస్తుంది. నాలుగుసార్లు బొడ్డు చుట్టూ ఇంజెక్షన్స్ తీసుకున్నారు. అందుకే నన్ను ఒక్క మాటకూడా అనరు' అనేది.

మొన్న ఓ ఇంగ్లీస్ సినిమా చూసా 'కామెడీ ఛానెల్'లో. కుక్క బాత్‌రూంలో కెళ్ళి కమోడ్‌లో మూతి పెట్టి నీళ్ళు తాగడం చూస్తాడు హీరో, అతను బయటకొచ్చేసరికి హీరోయిన్ దాని మూతి మీద ముద్దులు పెడ్తూ కనిపిస్తుంది. దాన్ని పక్కకి జరిపి ఆ తడి మూతితో హీరోని కిస్ చెయ్యమని ముందుకి వస్తుంది. అతని పరిస్థితి వర్ణనాతీతం. నేను ఇలా పెట్స్‌ని ముద్దులు పెట్టుకునే వాళ్ళని చాలా మందిని చూసాను. ఆ పెట్స్ తర్వాత ఆ మూతుల్ని ఎక్కడెక్కడ పెడ్తాయో బయటకి వెళ్ళి... నేను చెప్పలేను.

ఇంకో ఆవిడ ప్రొద్దుటే ఎఫ్.బిలో తను పాడిన పాటల వీడియోలన్నీ పెడుతుంది. ఇంకొకావిడ నా బోటిది 'బంగాళా దుంపలతో హల్వా' చెయ్యడం ఎలా ? అని పెడుతుంది.

కొంతమంది రోజూ శాలువాల మీద శాలువాలు కప్పించుకుంటూ, రకరకాల కళా సంస్థల వాళ్ళు చేసిన సన్మానాల ఫోటోలు పెడ్తారు. ఫర్వాలేదు. ఫేస్‌బుక్ ఉన్నదే అందుకు. కానీ కొంతమంది 'ఫీలింగ్ డిప్రెస్డ్' అనో 'ఫీలింగ్ పెయిన్డ్' అనో 'ఫీలింగ్ షాక్డ్' అనీ ఇలా రకరకాల స్టాటస్‌లు పెట్టి ఇంట్లో వాళ్ళని కన్‌ఫ్యూజ్ చేస్తుంటారు.

శుభ్రంగా అరడజను దోశలు లాగిస్తున్న పెళ్ళాం, ప్రొద్దుటే లేచి 'ఫీలింగ్ డిప్రెస్డ్' అని ఎందుకు పెట్టిందో ఆ మొగుడికి అర్థం కాదు.

'ఏం రోగమే? అలా ఎందుకు పెట్టావు?' అంటే 'వరూధినీ పరిణయంలో ఆ అత్త కోడల్ని ఎన్ని మాటలందో తెలుసా నిన్న?' అని అడుగుతుంది. అతను అప్పుడు 'ఫీలింగ్ షాక్డ్' అని పెడ్తాడు.

ఇంకొకావిడ 'సలహాలిస్తే తప్పా? విమర్శని తీసుకోకపోతే ఎలా?' అంటుంది. అది ఎవరికి తాకాలో వాళ్ళకి తాకుతుంది. మిగతా వాళ్ళకి కన్ఫ్యూజన్.

'విరేచనాలు ఆగట్లేదు.. నీరసంగా ఉంది' అని ఎఫ్.బి.లో పెట్టి సింపతీ కోరుకునేవాళ్ళు కొందరు. తెలివైనవాడు మోషన్స్ అవుతుంటే 'ఫీలింగ్ ఎమోషనల్' అని పెడ్తాడు కూడా!

ఇంకా కొంతమంది వాళ్ళని అడిగేవాళ్ళు ఉన్నా లేకపోయినా చూసిన ప్రతి సినిమా గురించీ రివ్యూలు రాసేసి, ప్రజల మీద తమ ఆలోచనలు రుద్దేస్తూ ఉంటారు.

'చిన్న సినిమాలని బ్రతికించండి' అని నినదిస్తారు. ప్రివ్యూలకి పిలిస్తే తప్ప టికెట్ కొనుక్కుని చిన్న హీరో ఉన్న సినిమాకి వెళ్ళరు. లేదా టీ.వీ.లో వస్తే చూడచ్చు 'నెల తిరక్కుండా టీ.వీ.లో వస్తుంది' అంటారు.

ఇంక వరలక్ష్మీ వ్రతాలూ, వినాయక చవితలూ, దీపావళిలూ లాంటి పండగలు ఎఫ్.బి.లో జరిగినంత గ్రాండ్‌గా ఎక్కడా జరుగవు. మంచిదే ఇది కాస్త కల్చర్ బ్రతుకుతోంది. మన ఏంకరమ్మాయిలూ, సింగర్లూ నలభై మూడేళ్ళు వచ్చాకా లంగా ఓణీల్లో, జుట్లూ విరబోసుకుని, వీపులు బయట పెట్టి 'టెలుగూ షంష్కృతిని' బతికిస్తూనే ఉన్నారు. మన దేశంలోనే కాదు అంతర్జాతీయంగా. పాజిటివ్ సైడ్ చూసుకుంటే, ఫ్యామిలీ అంటే కాస్త ఇంట్రెస్టూ, కేరూ పెరుగుతోంది. మనవల ఫోటోలూ, పెళ్ళిరోజు ఫోటోలూ, పుట్టిన రోజు ఫోటోలూ అన్నీ నలుగురి కోసం కాకుండా కుటుంబ సభ్యులకి ఒకరి పట్ల ఒకరికి అనురాగాలు పెంచితే శుభపరిణామమేగా! కవిత్వం, కథలూ అయితే యధేచ్ఛగా మిఠాయి అంగళ్ళలో మిఠాయిలా పంచేయచ్చు.

మొత్తానికి ఈ టెక్నాలజీ యుగంలో ఆరో నెల పసివాడు కూడా ఐపాడ్ చేతికివ్వకపోతే పాలసీసా నోట పెట్టుకోడు. **"చందమామ రావే జాబిల్లి రావే" రోజులు పోయాయి. "గూగులమ్మ రావే కార్టూన్ ఫిల్మ్ తేవే" అని పాడుకోవాల్సిందే**

ఫోటో షాప్ కెళ్ళి బాస్‌ని 'బృహన్నల'లా వేషం వేసి స్క్రీన్ సేవర్‌గా పెట్టుకుని ముసి ముసి నవ్వులతో పనులు చేసుకుంటున్నారు యువత. 'చెప్పే వాడికి వినేవాడు లోకువ' అనుకోకుండా ఎఫ్.బి తెరిచి నిద్ర లేవగానే, పళ్ళైనా తోముకోకుండా కొడ్తూనే ఉండు లైకులు. వేలు నొప్పెట్టి లేచాక అందులో చాలా చావు వార్తలుంటాయి. అవన్నీ 'లైక్ చేసినందుకు నొచ్చుకుని, 'ఫీలిగ్ సారీ' అని స్టాటస్ పెట్టి స్నానానికి వెళ్ళచ్చు.

జోకులు పెట్టేవాళ్ళు జోకులు.. ఫోటోలు పెట్టేవాళ్ళు ఫోటోలు.. విమర్శించేవాళ్ళు విమర్శలు.. కవిత్వాలు రాసేవాళ్ళు కవిత్వాలు.. ఓసారి ఎఫ్.బిలో తల దూర్చాకా కామెంట్లకి వెరవకూడదు.. **వినదగు నెవ్వరు చెప్పిన..**




Post your comments

